# 8

# నాకు నచ్చని నా కథ

ఓ ప్రముఖ పత్రిక ఎడిటర్‌గారి దగ్గర్నించి ఫోనొచ్చింది జయరామ్‌కి. వాళ్ళ పత్రికలో కొత్తగా మొదలు పెడుతున్న 'నాకు నచ్చిన నా కథ' శీర్షికకోసం జయరామ్ రాసిన కథల్లో అతనికి బాగా నచ్చిన కథ పంపించమని. పంపుతానన్నాడు రెండు రోజుల్లో. రచయితగా మంచి పేరూ, పెద్ద పేరూ ఉన్నాయి. వ్యక్తిగా కూడా మంచివాడే జయరామ్.

ఒక్క బలహీనతనించి మాత్రం తప్పించుకోలేక పోతున్నాడు. అప్పుడప్పుడు బార్‌కి వెళ్ళి తాగుతాడు. అదే అతనికున్న ఒక్కగానొక్క బలహీనత. అక్కడ పరిచయమయ్యాడు సర్వోత్తమరావు.

నా భార్య ప్రవర్తన వల్ల నేనిలా తాగుడికి బానిసనయ్యానంటూ చెప్పుకున్నాడు జాలిగా మొహం పెట్టి.

జయరామ్ రచయిత అని తెలిశాక తన కథ రాయమని అడిగాడు.

నవ్వేసి ఊరుకున్నాడు జయరామ్.

కానీ సర్వోత్తమరావు ఊరుకోలేదు.

ఇంక తప్పనిసరిగా అతని కథ విన్నాడు జయరామ్. విన్నాక అతనిపట్ల జాలీ, సానుభూతీ చోటు చేసుకున్నాయి మనసులో.

సర్వోత్తమరావు వెనక ఉన్న ఆస్తిపాస్తులు చూసి అతన్ని పెళ్ళాడిందిట కోమల. అతనంటే ఏ మాత్రం ఇష్టం లేదుట. పెళ్ళయితే చేసుకుంది గానీ తిరుగుళ్ళు బయట

ఎవరితోనో తిరుగుతుందిట. పిల్లలంటే అతనికిష్టం... పిల్లల్ని కనటం ఆమెకి ఇష్టం లేదు. ఇల్లు, కుటుంబం, నైతిక విలువలు వీటికి ప్రాధాన్యత ఇస్తాడతను. దానికి విరుద్ధం ఆమె స్వభావం. మరి పెళ్ళెందుకు చేసుకున్నట్టు? ఆ మాటడిగితే కోపం. కొన్నాళ్ళు పోతే మారతానంది... నమ్మి ఆమె కోరినట్టే చేశాడు. చుట్టాలు, పక్కాలు పిచ్చాడివన్నారు. మోసపోయావన్నారు. వాళ్ళ మాటలు లెక్కచెయ్యలేదు. భార్యకోసం ఏమైనా చేస్తానన్నాడు. కానీ ఆమెలో మార్పు కనిపిస్తేగా?... ఎప్పటిలాగే ఊరంతా అప్పులు, ఎవరెవరితోనో తిరుగుళ్ళు, లేడీస్ క్లబ్బుల్లో డబ్బు పెట్టి పేకాటా...

ఆ మాటకి మాత్రం చటుక్కున అడగకుండా ఉండలేకపోయాడు జయరామ్.

"డబ్బుపెట్టి పేకాటా?"

"అదే మరి... మనది హై సొసైటీ ఫ్యామిలీ కాదు కోమలా... ఇలాంటివి మనకి తగవు అని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. వినిపించుకుంటేగా".

"నమ్మలేకపోతున్నాను" పక్క కుర్చీలో ఉన్న మరో మిత్రుడు చిన్నగా నసిగాడు.

"నమ్మరండీ నమ్మరు. ఓ మగవాడు ఏడిస్తే, మరో మగవాడు నమ్మడు. ఏం చేస్తాం? అసలు అలాంటి ఆడదాన్ని ఏం చేసినా పాపం లేదు. ఏవంటారు జయరామ్ గారూ?"

"అలాంటి మగవాడినైతే ఏం చెయ్యకూడదా?" మళ్ళీ పక్క కుర్చీలోని మిత్రుడి సందేహం.

"మీకు స్త్రీ పక్షపాతం ఉందనుకుంటాను" లోపల్లోపల పళ్ళు నూరుకున్నాడు సర్వోత్తమరావు.

"నాకు పాతం లేదు వాతం లేదు" ఠక్కున వచ్చింది జవాబు.

"మీ మాటలు నేను నమ్ముతాను సర్వోత్తమరావుగారూ! బాధ పడకండి..." మనస్ఫూర్తిగా అన్నాడు జయరామ్.

"బాధపడకుండా ఎలా ఉంటాను చెప్పండి. ఆస్తంతా కరగబెట్టేసింది. ఇల్లెవడికో అమ్మేసింది. చెప్పాపెట్టకుండా ఓ రోజు ఇల్లొదిలి వెళ్ళిపోయింది. ఎవరితో వెళ్ళిందో ఏమో? బాధతో గుండె పగిలే దుఃఖంతో, ఒంటరి బతుకుతో నేనిలా అయిపోయాను" సర్వోత్తమరావుమీద సానుభూతి కురిపించి, తన పలుకులతో ఓదార్చి, అతని కథకి

తన ఊహాశక్తి జోడించి, చిలవలు పలవలు చేర్చి, ఆసక్తికరంగా అక్షరబద్ధం చెయ్యడం, ఓ పత్రికకి పంపించడం, అది ప్రచురించబడడం అన్నీ టకటకా జరిగిపోయాయి.

ఆ కథ చదివి విమర్శించినవాళ్ళూ ఉన్నారు. పట్టించుకోని వాళ్ళూ ఉన్నారు. ఇలాంటి ఆడాళ్ళూ ఉండకపోరు అంటూ దీర్ఘం తీసిన పురుషపుంగవులూ ఉన్నారు. ఇది నిజానికి దగ్గరగా ఉందా లేదా? తను రాసిన పద్ధతి సరిగానే ఉందా? అతిశయోక్తి నిండి ఉందా? వాస్తవానికి అతీతంగా రాశాడా? ఈ రకమైన విశ్లేషణ కథ రాసే ముందు గానీ రాసిన తర్వాతగానీ చేసుకోలేదు జయరామ్. ఆ అవసరం ఏమీ లేదనిపించింది.

అందుకే తన శ్రీమతి ఏదో అడగబోతే కూడా తేలిగ్గా తీసి పారేశాడు.

"అనుభవించిన వ్యక్తి స్వయంగా తన నోటితో తను చెప్పాడు. ఇంక అంతకంటే ఋజువులూ, సాక్ష్యాలూ ఏం కావాలి మనకి?"

"నాణానికి ఒకవైపే కదా మీకు తెలిసింది?"

"ఎప్పుడూ లేనిది నా కథ మీద నువ్వు చర్చ మొదలెట్టావేంటి?" కాస్త విసుగ్గానే చూశాడు.

"ఆ సర్వోత్తమరావు ఎవరోగానీ, ఒళ్ళు తెలియనంతగా బాగా తాగుతాడని మీరే చెప్పారుగా ఓసారి".

"అయితే?"

"తాగుబోతు మాటలు మీరు అంత ఇదిగా నమ్మాలా?"

ఆ ప్రశ్నకి ఒళ్ళు మండింది అతనికి.

తను కూడా తాగుతాడు కదా మరి... అందుకే...

"నీ సందేహం అదేనా?"

"అది కాదండీ! చాలా ఏళ్ళ కిందట ఎవరిదో ఓ కథ చదివాలెండి. అది నిజంగా జరిగిన కథే అని చెప్పుకునేవారు. ఎటొచ్చీ బయట నిజ జీవితంలో నాయకుడు చెడ్డవాడు నాయకి మంచిది అయితే కథలో అటుదిటు ఇటుదటుగా రాశారని తెగ చెప్పుకున్నారెండి జనాలు"

"లోకులు పలుగాకులు అన్నారు. ఏవైనా చెప్పుకుంటారు. వాక్ స్వాతంత్ర్యం అందరికీ వుంటుంది. అయినా, ఇప్పుడా సంగతి నువ్వు లేవదియ్యటంలో అర్థం లేదు... అనుమానం ముందుపుట్టి ఆడది తర్వాత పుట్టిందన్న మాట నిరూపిస్తున్నావు" వేళాకోళం చేస్తూ నవ్వాడు. కోపంతో కూడబలుక్కుని ఇంక అంతటితో ఆ సంభాషణ ఆపెయ్యమన్నట్టుగా అక్కడినించి లేచి వెళ్లిపోయాడు.

ఆ తర్వాతనించి సర్వోత్తమరావు మళ్ళీ ఎప్పుడూ ఎక్కడా బార్లో కూడా కనిపించలేదు జయరామ్‌కి. ఏవయ్యాడో, ఎక్కడున్నాడో తెలియలేదు. రోజులు, నెలలు గడిచిపోయాయి.

ఓ రోజు హడావిడి ఫోన్ వచ్చింది.

ఆ వ్యక్తితో ఇదివరకెప్పుడూ పరిచయం లేదు.

"సర్వోత్తమరావు మిమ్మల్ని వెంటనే ఓసారి రమ్మన్నాడు" ఇది కబురు. ఆశ్చర్యమనిపించింది.

ఇన్నాళ్లూ ఏమైపోయాడీ మనిషి? అకస్మాత్తుగా ఈ ఫోన్ ఏమిటి? రమ్మని ఎవరిచేతనో ఫోన్ చేయించటం ఏమిటి?

"ఎక్కడున్నాడు?" వెంటనే అడిగాడు.

ఫలానా చోట ఉన్నాడంటూ చిరునామా చెప్పి తేలిగ్గా తెలుసుకునేందుకు కొన్ని గుర్తులవీ కూడా చెప్పాడు.

వెంటనే బయల్దేరి వెళ్ళిన జయరామ్‌కి అంతా అయోమయంగా అనిపించింది.

ఓ పడిపోతున్న పెంకుటిల్లది. దగ్గర్లో ఇళ్ళు లేవు. దూరంగా అక్కడక్కడున్నాయి. ఆ ప్రాంతంలో ఇదివరకెప్పుడూ అడుగుపెట్టింది లేదు జయరామ్.

"మీరు జయరామ్‌గారా?" ఆ పక్కగా ఒక బండరాయిమీద కూర్చొని ఉన్న కుర్రాడు లేచాడు.

ఔనన్నట్టుగా తల ఊపగానే మళ్ళీ అన్నాడు "లోపలకి వెళ్ళండి. సర్వోత్తమరావు మీకోసం ఎదురు చూస్తున్నాడు. నే పోతున్నా".

అటూ ఇటూ చూస్తూ మెల్లగా లోపలికి వెళ్ళిన జయరామ్‌కి అక్కడ చాపమీద నిస్సత్తువగా, ఎముకల పోగులా, దీనంగా చూస్తూ పడుకుని ఉన్న వ్యక్తి, పక్కన

నేలమీద బక్కపలుచగా పాత నూలు చీరలో, కరుణ తొణికిసలాడుతున్న చూపులతో, కలగాపులగంగా ముఖంలో తారట్లాడుతున్న భయం బెంగల ప్రతిరూపంగా మరొక ఆకారం కనిపించారు. తను లోపలకు అడుగు పెట్టగానే లేచి నిలబడింది ఆమె.

ఇతను సర్వోత్తమరావా? ఇలా అయిపోయాడేంటి? చాలా మార్పు వచ్చేసిందే? మృత్యువు కోరల్లో చిక్కుకున్న ప్రాణంలా కనిపిస్తున్నాడేవిటి? ఏం జబ్బు చేసిందో పాపం... భార్య చేసిన మోసానికి బలి అయినవాడు... తట్టుకోలేక మందు ఎక్కువగా ఇరవై నాలుగ్గంటలూ బాధతో సమానంగా మింగుతూ ఉన్నాడా? అస్థిపంజరమై పోయాడు... ఎంత దురవస్థ?

దగ్గరగా వెళ్ళి కింద కూర్చున్నాడు.

"హఠాత్తుగా ఏమయింది సర్వోత్తమరావుగారూ! గుర్తుపట్టలేనట్టుగా అయిపోయారు".

మాటలు కూడదీసుకుంటున్నట్టుగా నెమ్మదిగా ఆగి ఆగి సమాధానం ఇచ్చాడు సర్వోత్తమరావు.

"హఠాత్తుగా కాదులెండి. నేను చేసిన పాపాలు నాకున్న అలవాట్లు నన్ను చాలా రోజులుగా తినేస్తూనే వున్నాయి... అన్నట్లు ఈమె నా భార్య కోమల".

చటుక్కున తలెత్తి ఆమెవంక చూశాడు జయరామ్.

ముఖంలో కదలాడుతున్న నీలినీడలు...

జీవాన్ని కోల్పోయినట్టున్న కళ్ళు...

ఆమె చేసిన మోసానికి, వేసిన వేషాలకి శిక్ష బాగానే అనుభవిస్తోందనిపించింది. ఇప్పుడు ఏ దారీ లేక, నిలవ నీడలేక మళ్ళీ ఇతని పంచకే చేరినట్టుంది.

"జయరామ్‌గారూ! ఇంక నా బతుకు కొన్ని గంటల్లోకి వచ్చింది. చుట్టుపక్కల అందరూ నన్ను ఏనాడో వెలివేశారు. అందుకే ఒంటరిగా ఇక్కడికొచ్చి పడ్డాను. వారం రోజుల కిందట కోమలకి కబురు పంపితే... నన్ను క్షమించి అవసాన దశలో ఉన్న నాకు సేవ చేయడానికి పెద్ద మనసు చేసుకుని వచ్చింది. మీరు కూడా నన్ను క్షమించాలి. నేను పోయేలోపు మీకు నిజాన్ని చెప్పాలని మిమ్మల్ని రమ్మని కబురు చేశాను".

చేతులు జోడించాడు. వణుకుతున్నాయి ఆ చేతులు. నిర్ఘాంతపోయాడు జయరామ్. అతను కదా ఆమెను క్షమించాల్సింది... ఆమె అతన్ని క్షమించి వచ్చింది అన్నమాటే ఆశ్చర్యంగా అనిపిస్తుంటే... తనని కూడా క్షమార్పణ అడగటం మరింత ఆశ్చర్యంగా ఉంది.

“ఏమిటి మీరనేది? మీరేం తప్పు చేశారనీ?”

“చేశాను. నా గురించి నేను మీకు చెప్పిన కథ పాత్రలు మార్చి చెప్పాను. నా చెడు అలవాట్లు, ఆస్తంతా తగలెయ్యటం, ఇల్లు అమ్మెయ్యటం, భార్యనొదిలేసి వేరే డబ్బున్న అమ్మాయిల్తో ఇష్టం వచ్చినట్లు తిరగటం, ఆడిన నాటకాలు అన్నీ కూడా కోమల చేసిన పనులుగా చెప్పి, ఆమె తన భర్తని మోసం చేసినట్టుగా చెప్పి మీచేత కథ రాయించాను...” చెప్పుకుపోతున్నాడతను. నవనాడులూ కుంగిపోతున్నట్టనిపించింది జయరామ్‌కి. ఆ కథ రాసిన తన చేతివేళ్ళు నిస్సత్తువగా వేలాడిపోతున్నట్టనిపించింది. నోట మాట రాలేదు. చూపులు మాత్రం ఎందుకు అబద్ధం చెప్పావని నిలదీస్తున్నట్టే ఉన్నాయి.

జయరామ్‌గారూ! శారీరకంగా, మానసికంగా పతనమైపోయిన నాలో పురుషాహంకారం మాత్రం రవ్వంత కూడా తగ్గలేదు. ఓర్పుగా నాలో మార్పుకోసం ఎదురు చూస్తూ కాపరం చేసే నా భార్యని చూస్తే ఈర్ష్యపడే వాడిని. ఇరుగు పొరుగు ఆమెపట్ల చూపే సానుభూతిని కూడా అనుమానంగా చూసే స్థితికి దిగజారాను... మీకు అబద్ధం చెప్పి మీ చేత కథ రాయించి తృప్తిపడడం... చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమేనని అర్థమైంది.

ఎంత పని జరిగింది? మీ అబద్ధాలతో మీతోపాటూ నేనూ దోషినయ్యాను కదా! జయరామ్ మనసు విలవిలలాడిపోయింది.

“కోమలని వెళ్ళగొట్టినప్పటినుంచి తను ఎక్కడున్నది, ఎలా బతుకుతున్నదీ నాకు తెలుసు. రహస్యంగా వివరాలు సేకరించాను. ఒక అనాథాశ్రమంలో పిల్లలకి సేవలు చేస్తూ అదే తన ప్రపంచంగా జీవితం గడుపుతోంది. నేను ఎక్కడున్నదీ తనకి తెలియదు. ఇన్నాళ్ళ తర్వాత తనకి కబురు చేశాను నన్ను క్షమించి ఒకసారి రమ్మని. కాదనకుండా వచ్చింది...” కృతజ్ఞతా పూర్వకంగా భార్యవైపు చూశాడు సర్వోత్తమరావు.

అప్పుడు నోరు విప్పింది కోమల. మానవత్వానికి విలువనిచ్చే మనస్తత్వాన్ని మలుచుకున్న కోమల. పతివ్రతని అనే పేరు సంపాదించుకోవాలన్న కోరికతో ఇక్కడికి రాలేదు నేను జయరామ్‌గారూ. మనస్ఫూర్తిగా అక్కడ అనాథ పిల్లలకి సేవ చేస్తున్నాను. అదే భావంతో ఈ అనాథ ఆఖరి కోరిక మన్నించి..." ఒక్కక్షణం ఆగింది కోమల. అనాథ అన్నమాట పలికినప్పుడు ఆమెకేసి తేరిపార చూశాడు సర్వోత్తమరావు. ఆ మూడక్షరాలూ ఆమె మొహాన్ని వికృతంగా మార్చలేదు. ఆమె కళ్ళల్లోకి కసిని కక్కలేదు. నీకు నేనే దిక్కు అయ్యాను చూశావా అన్న గర్వాన్ని గానీ, హేళనగానీ ఆమె గొంతులో ధ్వనింపచెయ్యలేదు. పూవు సహజ సిద్ధంగా వికసించినట్టు, మల్లెపూవు లాంటి మనసు విప్పింది మాటల్లో...

"నేను చేయగల సాయమేదైనా ఉంటే చేసి వెళ్దామని ఒక మనిషిగా ఇక్కడికి వచ్చాను. అంతే తప్ప త్యాగశీలి అనో, పతివ్రత అనో అనిపించుకోవాలని రాలేదు".

అప్రయత్నంగా చేతులు జోడించాడు జయరామ్ ఆమెకి. ఆమెలోని అసలైన మనిషికి... ఆ మనిషిలోని నిజాయితీకి, సర్వోత్తమరావు మనసులో ఇంకా ఏమూలైనా అహంకారపు జాడలు మిగిలివుంటే వాటిని పూర్తిగా ఆమె మాటలు తుడిచేస్తాయనడంలో ఆశ్చర్యం లేదనిపించింది. కానీ, ఈ ఆఖరి ఘడియల్లో ఇప్పుడతని మనసులో ఆమె వ్యక్తిత్వం పరిపూర్ణంగా ఆవిష్కృతం అయినందువల్ల ఆమె కేమిటి ప్రయోజనం అని కూడా అనిపించింది. జాలిగా ఆమెవైపు చూశాడు. మరుక్షణం తన పొరపాటు తెలుసుకున్నాడు... జాలినో, సానుభూతినో లేదా ఏదన్నా ప్రయోజనాన్ని ఆశించిగానీ ఆమె ఇక్కడికి రాలేదు కదా?

"ఈయన మరణానికి చింతించే దశని ఏనాడో దాటిపోయాను. మళ్ళీ నేను వెళ్ళిపోయేది ఆ అనాథాశ్రమానికే. అక్కడ భవిష్యత్తునే తప్ప గతాన్ని చూసే అలవాటు లేదు ఎవరికి. గతంనించి నేర్చుకోతగ్గ పాఠాలు ఉంటే నేర్చుకోవాలి ఎవరైనా సరే. కానీ గతాన్ని తవ్వుకుంటూ అందులో కూరుకుపోతుంటే భవిష్యత్తు కనపడదు కదా!"

కోమల పలుకులు మాటల్లా కాదు... మంత్రోచ్చారణలా అనిపించాయి శ్రోతలిద్దరికీ.

సర్వోత్తమరావు చెప్పిన కథ రాసినందుకు తనని తనే తిట్టుకున్నాడు జయరామ్.

ఇంటికి వెళ్ళగానే ముందు ఎడిటర్‌గారికి ఫోన్ చేశాడు.

"నాకు నచ్చిన నా కథ ముందు, నాకు నచ్చని నా కథ ఒకటి పంపుదామను కుంటున్నాను.

రచయిత మనసుకి నచ్చని కథ ఏదైనా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది అనడానికి నేనే నిదర్శనం లెండి. ఇదో కొత్త శీర్షిక అనుకోండి".

కోమల, సర్వోత్తమరావులు కళ్ళముందు కనిపిస్తూ నిద్రపట్టలేదు ఆ రాత్రి జయరామ్‌కి.

*కథల పోటీలో మూడవ బహుమతి పొందిన కథ*
*మల్లెతీగ మాసపత్రిక, నవంబర్ 2009*